క్లుప్తంగా

చిన్నారులకు ఫిజియోథెరపీ



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో పలు వ్యాయామాలు చేయించారు. పిల్లల ఆరోగ్యం, రోజూ చేయించాల్సిన వ్యాయామాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. రోజూ ఇంటి దగ్గర ఉదయం, సాయంత్రం వ్యాయామాలు చేయించాలని చెప్పారు. సమగ్రశిక్ష ద్వారా అమలవుతున్న థెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు దాడి శివ, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

జగ్గంపేట: గ్రామంలో మత్తు పదార్థాల విక్రయంపై నిఘా పెట్టిన పోలీసులు ఇద్దరు యువకులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్టుగా జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. స్థానిక నెహ్రూ కాలనీకి చెందిన యువకులు సునీల్(20), రామవరం గ్రామానికి చెందిన సుధీర్(19) గంజాయిని విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామని, వారి వద్ద నుంచి 2.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచగా జడ్జ్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కిర్లంపూడి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. బూరుగుపూడిలో బుధవారం రాత్రి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ చిట్టీలు, మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై సీఐ శ్రీనివాస్ ప్రజలకు అవగాహన కల్పించారు. తరచూ జరిగే సైబర్ నేరాలకు సంబంధించిన పలు వీడియోలు ప్రదర్శించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెం, బవురువాక, ధారపల్లి గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, స్థానిక ఎక్సైజ్ పోలీసులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించి, 3,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ కథనం మేరకు పెద్దిపాలెం గ్రామంలో సారా తయారీకి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల పులిసిన బెల్లపు ఊటను, బవురువాక గ్రామంలో 1,900 లీటర్లు, ధారపల్లి గ్రామంలో 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కేవీ స్వామి, ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారని సీఐ శివప్రసాద్ తెలిపారు.

1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తొండంగి: పెరుమాళ్లపురం పంచాయతీ బుచ్చియ్యపేట గ్రామశివారులో సారా తయారీకి వినియోగించే 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ ఎస్సై పట్టాభి చౌదరి బుధవారం తెలిపారు. గ్రామం నుంచి అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేయగా డ్రమ్ముల్లో నిల్వ ఉంచి 1200 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేశారన్నారు.

బాలుడి అదృశ్యం



అరవింద్ (ఫైల్)

ప్రత్తిపాడు: తండ్రి మందలించాడని ఓ బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సీఐ బి.సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవరం గ్రామానికి చెందిన 14 ఏళ్ల తూరంగి అరవింద్‌ను ఈ నెల 12వ తేదీన అతడి తండ్రి మందలించాడు. దీంతో బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి పరిసర గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం ప్రత్తిపాడు పోలీసులకు బాలుడి తండ్రి ఫిర్యాదు చేశాడు. అరవింద్ ఆచూకీ తెలిసిన వారు 94407 96530, 94407 96530 నంబర్లక సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ఏలేశ్వరం: బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. పార్టీ పట్టణ నాయకుడు పైల సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలోని పట్టణ పరిధిలోని 22 బూత్‌లకు బుధవారం బూత్‌స్థాయి అధ్యక్షుడిని ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు. పట్టణంలోని 14వ బూత్ అధ్యక్షుడిగా కర్రోతు జానకీరామయ్య, 19వ బూత్ అధ్యక్షుడిగా గెద్దరామకృష్ణ, 21వ బూత్ అధ్యక్షుడిగా గంటా శివ, 22 బూత్ అధ్యక్షుడిగా కర్రోతు నీలకంఠేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో బీజేపీని పటిష్టం చేయడమే తమ లక్ష్యమన్నారు. ఎన్నికల అధికారిగా ఉమ్మిడి వెంకట్రావు వ్యవహరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతల పాండవులు, పైల ప్రసాద్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు భరోసా కరవు



బలరామపురంలో రైతు భరోసా కేంద్రం



ఏ మల్లవరంలో అసంపూర్తిగా నిలిచిన రైతు భరోసా కేంద్రం

- రైతులకు అందని రైతు భరోసా సొమ్ము
- ఇచ్చిన హామీని పక్కన పెట్టిన ప్రభుత్వం
- ఇబ్బంది పడుతున్న రైతులు

రౌతులపూడి: ఉన్న ఊరిలోనే రైతులకు సేవలందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమం, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితర పథకాలు అందించేందుకు ఈ రైతు భరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ రైతుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆందోళన చెందుతున్నారు.

పేరు మార్పు తప్ప సాయం లేదు

మండలంలోని సుమారు 10,617 మంది రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభం నుంచి దశల వారీగా డీబీటీ విధానం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా సొమ్మును అందించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పూర్తయినా కాని నేటికీ ప్రభుత్వం రైతులకు భరోసా అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల పేరు మార్చి రైతు సేవా కేంద్రాలుగా నిర్వహణ చేపట్టారు. కానీ రైతులకు సాయం అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండి పడుతున్నారు.

అసంపూర్తిగా భవనాలు

గత ప్రభుత్వం మండలంలోని 20 పంచాయతీలకు 26 గ్రామ పంచాయతీలుగా, 17 గ్రామ సచివాలయాలుగా విభజించింది. 17 గ్రామ సచివాలయాలకు 17 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.21 లక్ష చొప్పున నిధులు మంజూరు చేసింది. వీటిలో 8 కేంద్రాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. లచ్చిరెడ్డిపాలెం, ఏ మల్లవరం, రాజవరం, ఎస్ఎస్‌పట్నం, రౌతులపూడి-2, గుమ్మరేగుల, ఎస్ అగ్రహారం గ్రామాల్లో నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. శంగవరం, గంగవరం సచివాలయాల్లో నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు శిక్షణ కార్యక్రమాలు, విత్తనాలు, ఎరువులు అందడం లేదని చెబుతున్నారు.

అందని పెట్టుబడి సాయం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పూర్తయినా నేటికీ పెట్టుబడి సాయంగా ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం అందించలేదు. ఏటా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా సొమ్ము అందించలేదు. రైతులందరం ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా పెట్టుబడి సాయం అందించాలి.
– జీరెడ్డి నానాజీ, రైతు, ఏ మల్లవరం

నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు

అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా(రైతుసేవా) కేంద్రాలను పరిశీలించి వివరాలు సేకరిస్తాం. నిర్మాణాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సేవలందేలా చర్యలు చేపడతాం.
– శివరామకృష్ణయ్య, ఎంపీడీఓ, రౌతులపూడి

దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు

గండేపల్లి: మెట్ట ప్రాంతం భక్తుల కొంగుబంగారం మురారి కనకదుర్గమ్మ అమ్మవారి జాతర బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని మండల ప్రజలతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారికి నైవేద్యం సమర్పించి జాతరను ప్రారంభించడంతో గ్రామస్తులతోపాటు పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రహదారికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో మామిడితోటల్లో వేపచెట్టు కింద వెలసిన ఈ అమ్మవారిని దర్శనం కోసం ఏడాది పొడవున భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. డిసెంబర్‌లో పౌర్ణమి వెళ్లిన అనంతరం తదియ గడియల్లో అమ్మవారి జాతరను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు.

అడిగిన వారందరికీ పని కల్పించాలి

గండేపల్లి: అడిగిన వారందరికీ పని కల్పించాలని. ప్రతి ఒక్కరికీ రూ.300 వచ్చేలా పనిచేయించాలని ఎంపీడీఓ నాతి బుజ్జి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎన్ఆర్జీఎస్ రివ్యూ సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి పథకంలో పని అడిగిన వారందరికీ పని కల్పించాలన్నారు.

51 మందికి వైద్య పరీక్షలు

కిర్లంపూడి: జగపతినగరం-2లోని కొండయ్యపేటలో బుధవారం నిర్వహించిన సంచార చికిత్స (ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం)లో కిర్లంపూడి ప్రభుత్వాసుపత్రి వైద్యుడు రాంబాబునాయక్ 51 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైద్య సిబ్బంది సీహెచ్ఓ పి.సాయిరమ్య, వై.ప్రమీల, డీఈఓ విజయ్, ఆశావర్కర్లు ఉన్నారు.

గందరగోళంగా కౌన్సిల్ సమావేశం

- వ్యక్తిగత దూషణలకు దిగిన కౌన్సిలర్లు



సమావేశంలో వాదోపవాదాలు చేసుకుంటున్న కౌన్సిలర్లు

ఏలేశ్వరం: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం బుధవారం వాడీవేడిగా జరిగింది. వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్లు ప్రజాసమస్యలతో పాటు వ్యక్తిగత దూషణలకు దిగడంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీకి చెందిన 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు మాట్లాడుతూ పట్టణంలో కుక్కల నిర్మూలనపై అధికారులు వివరాలు తెలిపాలని కోరారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం కోట్లాది రూపాయలతో జగనన్న కాలనీలను నిర్మించారన్నారు. ప్రస్తుతం కాలనీలో జరుగుతున్న నిర్మాణ పనులపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడం దారుణమన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోపి మాట్లాడుతూ జగనన్న కాలనీలో గతంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిపై గోవిందు మాట్లాడుతూ గతంలో అందరూ వైఎస్సార్ సీపీలోనే ఉన్నారన్నారు. దీంతో గందరగోళం ఏర్పడింది. తోటి కౌన్సిలర్లు జోక్యం చేసుకోవడం ప్రశాంత వాతావరణం ఏర్పడింది. అనంతరం సమావేశం వాయిదా వేశారు. సమావేశంలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు ఆమోదానికి నోచుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ ఎం.సత్యనారాయణ, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వినోద్‌మిశ్రాకు నివాళి



తునిలో కామ్రేడ్ వినోద్ మిశ్రాకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం లిబరేషన్ నాయకులు



ఏలేశ్వరంలో వినోద్‌మిశ్రా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం కామ్రేడ్ వినోద్ మిశ్రా 26వ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక బాలాజీ చౌక్ వద్ద సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం వినోద్‌మిశ్రా అనేక పోరాటాలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో తమ పార్టీ ఉద్యమబాట కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీనేతలు సోమాల కుశల, నాగులాపల్లి అర్జునుడు, మసిరపు రాజారావు, మాడెం బాబూరావు, గూనాపు సాయి, కందులప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుని: ఫాసిజానికి వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాన్ని నడిపిన కామ్రేడ్ వినోద్ మిశ్రాకు ఘన నివాళులు అర్పించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తుని ఇన్‌చార్జి కె.జనార్దన్ అన్నారు. బుధవారం తునిలో వినోద్‌మిశ్రా వర్ధంతిని నిర్వహించారు. సీపీఐ లిబరేషన్ తుని శాఖ కమిటీ సభ్యులు జి.సింహాచలం, దడాల లోవరాజు, జి.శ్రీను, సత్తిబాబు, చంటిబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: పాండవులపాలెంలో దివంగత కమ్యూనిస్టు నేత వినోద్ మిశ్రా వర్ధంతిని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు రేచుకట్ల సింహాచలం, మానుకొండ లచ్చబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మిశ్రా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు, నాయకులు తాడి నాగేశ్వరరావు, టి.లక్ష్మణరావు, బి.కామరాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: గోవిందపురంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో వినోద్ మిశ్రా వర్ధంతి సభ జరిగింది. లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో వినోద్ మిశ్రా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లిబరేషన్ నేతలు జక్కంపూడి రాజా, నాగులపల్లి రమణ,నాగులాపల్లి అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



గోకవరం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేఆర్ఆర్‌సీ భాస్కర్ రెడ్డి

గోకవరం: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేఆర్ఆర్‌సీ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోకవరంలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రైతుల సమస్యలను తీర్చడం కోసం, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూమికి సంబంధించిన ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక రెవెన్యూ సిబ్బంది ద్వారా 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎంపీ సాయిప్రసాద్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉప తహసీల్దార్ సాయికిరణ్ అన్నారు. మండలంలోని సోమవరం, కృష్ణవరం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రీసర్వే ఉపతహసీల్దార్ ఆర్.శ్రావణి, ఎంఎల్ఎస్ఓ షేక్ బషీర్, ఆర్ఐ సత్యదేవి ప్రజల నుంచి వచ్చిన 11 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ భూ సరిహద్దుల వివాదాలకు తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవస్థానం ఆస్తులపై నిఘా

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని దేవదాయ, ధర్మదాయశాఖ ఇన్‌చార్జి కార్యదర్శి, కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. బుధవారం సాయంత్రం దేవస్థానం ఈఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈఓ వి.సుబ్బారావుతో ఆయన మాట్లాడారు. దేవస్థానం భూముల లీజు, కౌలు వసూలు విషయంలో రాజీ పడవద్దని ఆదేశించారు. వ్రతపురోహితులు భక్తులను గోదానం, భూ దానం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, వాటిని కట్టడి చేయాలన్నారు. వ్రత మండపాలలో వాయిస్ రికార్డు అయ్యే సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఐలాజ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి



ప్రత్తిపాడు బార్ కార్యాలయంలో ఐలాజ్ జాతీయ మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: ఆల్ ఇండియా లాయర్స్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రెండో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ కోరారు. ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం బార్ ప్రతినిధులు మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం కటక్‌లోని కళావికాస్ కేంద్రంలో ఈనెల 21, 22 తేదీల్లో ఐలాజ్ రెండో జాతీయ మహాసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మహాసభకు సుప్రీంకోర్టు, మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఏకే పట్నాయక్, జస్టిస్ కె.చంద్రు ముఖ్యఅతిథులుగా హాజరై 'న్యాయ వ్యవస్థ-స్వతంత్రత' అనే అంశంపై ప్రసంగిస్తారని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఐలాజ్ రాష్ట్ర కోశాధికారి అవసరాల దేవీ, బార్ ప్రతినిధులు రవణం వీర వెంకట్రావు, బొంగుకూరి మధుబాబు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుకులు.. పరుగులు..



కోటనందూరులో కోసిన పంటను కుప్ప వేసేందుకు తరలిస్తున్న రైతులు

- అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు
- జోరుగా వరి మోతలు, కుప్పలు
- పంట ఒబ్బిడిలో రైతులు

కోటనందూరు: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా అన్నదాత ఉరుకులు, పరుగులు పెడుతున్నాడు. ఏ క్షణంలో నైనా వర్షం పడుతుందని బెంబేలెత్తిపోతున్నాడు. ఈ ఏడాది మండలంలో 10,425 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేయగా ప్రస్తుతం సగం పంట కోసి పనలపై ఉంది. బుధవారం సాయంత్రం ఓ మోస్తరు జల్లులు పడడంతో రైతులు ఉరుకులు, పరుగులతో కోసిన పంటను హడావుడిగా కుప్పలు వేసుకున్నారు. కూలీల కొరత, పనలు ఆరకపోవడంతో కోసిన దానిలో సగానికి పైగా పనలపైనే ఉంది. మరో మూడు వేల ఎకరాల్లో పంట పక్వానికి చేరి కోతకు సిద్ధంగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షం కురిస్తే తీవ్ర నష్టం జరుగుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి రాత్రనక, పగలనక కష్టపడిన కష్టమంతా నీటిపాలవుతుందని లబోదిబోమంటున్నాడు. ఏటా ఖరీఫ్ చివరిలో ఈ ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నాడు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

శంఖవరం: రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. గ్రామంలో వరి పంటలను, వేసిన కుప్పలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పపీడనం తీవ్రత ఎక్కువగా ఉండడంతో రైతులు కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన కోతలను త్వరగా కుప్పలు వేయాలన్నారు. కల్లంలో ఉన్న దాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలన్నారు. వేసిన కుప్పలపై తారబల్లలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయకులు హిమబిందు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

- ఇందిరా క్రాంతిపథం ఏపీఓ నాగేశ్వరరావు
- సుస్థిర సమగ్రాభివృద్ధిపై ముగిసిన శిక్షణ తరగతులు



తుని మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏపీఓ నాగేశ్వరరావు

తుని రూరల్: గ్రామాభివృద్ధే ధ్యేయంగా సర్పంచులు, సచివాలయ, ఇతర శాఖల అధికారులు పని చేయాలని, మహిళాభ్యున్నతికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఇందిరా క్రాంతిపథం ఏపీఓ నాగేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ మరిడయ్య అధ్యక్షతన రెండో రోజు సర్పంచులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తీసుకునే చర్యల పై అవగాహన కల్పించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. ఈశిక్షణా తరగతులకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వ్యవసాయ, గృహ నిర్మాణ, వైద్య, విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. ఈశిక్షణా తరగతుల ప్రారంభించిన ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ ప్రారంభించగా ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు శిక్షణ లక్ష్యాలను వివరించారు. ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి జె.శ్రీనివాసు హాజరయ్యారు.

కోటనందూరు: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే పల్లెల్లో సుస్థిరత సాధ్యమని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. రెండు రోజులపాటు జరిగిన సుస్థిరమైన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.జయరాం, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థాయికరించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనేక అంశంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండురోజుల శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామం, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, గ్రామంలో మంచినీరు, క్లీన్ అండ్ గ్రీన్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వీటిని గ్రామాల్లో అమలు చేసేలా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలోఎంపీడీఓ సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ శిక్షణలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎంపీడీఓ నాతి బుజ్జి గ్రామాల అభివృద్ధిపై పలు విషయాలను సిబ్బందికి వివరించారు.

కిర్లంపూడి: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక సత్యదేవా కల్యాణ మండపంలో బుధవారం రెండో రోజు మండల స్థాయి అధికారులు, సర్పంచులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, ఈఓపీఆర్డీ సత్యప్రసద్ తదితరులు ఉన్నారు.



కిర్లంపూడిలో శిక్షణ ఇస్తున్న అధికారులు



కోటనందూరులో శిక్షణ పొందిన వారితో ఎంపీపీ, ఎంపీడీఓ

నిద్రమత్తులో కేశఖండన సిబ్బంది

- కౌంటర్ వద్ద భక్తులు పడిగాపులు
- అదే సమయంలో వచ్చిన ఈఓ
- ఆఫీసు తాళాల పగలగొట్టి టిక్కెట్ల విక్రయం
- ఇద్దరు సస్పెన్షన్



రత్నగిరిపై కేశఖండన శాల



కేశఖండన శాల వద్ద బద్దలు గొట్టిన కౌంటర్ తాళాలు

అన్నవరం: రత్నగిరి కొత్త ఈఓ వి.సుబ్బారావు గత నాలుగు రోజులుగా ప్రాతః కాలంలోనే వివిధ విభాగాలను తనిఖీ చేస్తున్నారు. అయినా దేవస్థానం సిబ్బందిలో ఎటువంటి మార్పు లేదనడానికి ఇదో ఉదాహరణ.

సత్యదేవునికి తలనీలాల సమర్పించుకునేందుకు వచ్చిన భక్తులు బుధవారం వేకువజాము 4.30 గంటల నుంచే కేశఖండనశాల వద్ద వేచి ఉన్నారు. దేవస్థానం అధికారుల ఆదేశాల ప్రకారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి సిబ్బంది కేశఖండన టిక్కెట్లు విక్రయించాల్సి ఉంది. అయితే ఉదయం 5.15 గంటలు అయినా టిక్కెట్ కౌంటర్ తెరవలేదు. దీంతో భక్తులు ఆ చలిలోనే వేచి ఉన్నారు. అదే సమయంలో ఈఓ సుబ్బారావు తలనీలాలు సమర్పించేందుకు అక్కడకు వచ్చారు. అయితే అక్కడ కౌంటర్ వద్ద భక్తులు వేచి ఉండడం చూసి, విషయం తెలుసుకున్నారు. దీంతో మొదట భక్తులకు గుండ్లు గీయాలని అక్కడ నాయీబ్రాహ్మణులను ఆదేశించారు. ఆ తర్వాత టిక్కెట్ కౌంటర్ తాళాలు బద్దలు గొట్టి అక్కడ కంప్యూటర్‌లో పాస్‌వర్డ్ మార్చి, కేశఖండన టిక్కెట్లు విక్రయించారు. ఇది జరిగేటప్పటికీ ఉదయం ఆరు అయిందని అధికారులు తెలిపారు. కేశఖండన శాల కౌంటర్‌లో టిక్కెట్లు విక్రయించాల్సిన కాంట్రాక్ట్ ఉద్యోగిని ఎం.మల్లేశ్వరికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. విధులకు గైర్హాజర్ అయినందుకు గాను ఆమెను, భక్తులు ఇబ్బంది పడుతున్నా ఆ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురాకుండా బాధ్యతా రహితంగా వ్యవహరించిన కేశఖండన శాల గుమస్తా యడ్ల బుల్లబ్బాయ్‌ని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈఓ ఆదేశాలు జారీ చేశారు. దేవస్థానం సిబ్బంది తెల్లవారుజామున నాలుగు గంటలకే విధులకు హాజరవ్వాలని ఆదేశించారు.